సాక్షి ఆదిలాబాద్
మంగళవారం । 3 । అక్టోబర్ । 2023



సోయా రైతు చిత్తు! 8లో▸
వాతావరణ మార్పుల కారణంగా సోయా పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. పూత దశలో తెగుళ్లు సోకగా రైతులు సస్యరక్షణ చర్యలు, పిచికారీ చేసినా ఫలితం లేకుండా పోతుంది.



ప్రగతిభవన్‌కు పాదయాత్ర
ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆదివాసీలు ఆందోళన బాట పట్టారు. ప్రగతి భవన్‌కు సోమవారం పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33.0/23.0
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

రక్తదానం అభినందనీయం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో నరేందర్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ తదితరులు

ఆదిలాబాద్‌టౌన్: రక్తదానానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్ అన్నారు. పట్టణానికి చెందిన బెస్ట్ ఫ్రెండ్స్ వెల్ఫేర్ సొసైటీ, కృషి మిత్ర,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రిమ్స్ బ్లడ్‌బ్యాంకులో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. రక్తదాతలను అభినందించారు. ఇందులో వైద్యులు తిప్పేస్వామి, శ్యాం ప్రసాద్, అబ్దుల్ అజీజ్, ఠాకూర్ రాణాప్రతాప్ సింగ్, శ్రీకాంత్, భగవాండ్లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన చిన్నారులు

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన తైక్వాండో క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 30 నుంచి సోమవారం వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో 14 పతకాలను సాధించారు. ఇందులో ఒక స్వర్ణ, 3 రజత, 10 కాంస్య పతకాలు ఉన్నాయి. పతకాలు సాధించిన చిన్నారుల్లో జిల్లా కేంద్రానికి చెందిన పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉన్నట్లు తైక్వాండో కోచ్ అన్నారపు వీరేష్ తెలిపారు.

కాంగ్రెస్ లీగల్ సెల్ చైర్మన్‌గా సంజయ్‌రెడ్డి

కైలాస్‌నగర్: కాంగ్రెస్ పార్టీ అనుబంధ లీగల్, హ్యూమన్ రైట్స్, ఆర్‌టీఐ విభాగం జిల్లా చైర్మన్‌గా ఆదిలాబాద్ పట్టణానికి చెందిన యెల్మ సంజయ్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు ఆ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ కంపల్లి ఉదయ్‌కాంత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్‌పీ నేత భట్టి విక్రమార్క, మధుయాష్కీగౌడ్‌తో పాటు ఉదయ్‌కాంత్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

హాకీ ప్రాచుర్యానికి మల్లేశ్వరరావు కృషి



నివాళులర్పిస్తున్న హాకీ క్రీడాకారులు

ఆదిలాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో హాకీ క్రీడా ప్రాచుర్యానికి స్వర్గీయ హాకీ శిక్షకుడు, రిటైర్డ్ పీడీ ఎస్. మల్లేశ్వరరావు ఎంతో కృషి చేశారని ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బాలూరి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మల్లేశ్వరరావు ఇటీవల మృతి చెందడంతో జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సోమవారం సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ మల్లేశ్వర్‌రావు మృతి క్రీడారంగానికి తీరనిలోటన్నారు. కార్యక్రమంలో పెటా సంఘం అధ్యక్షుడు పార్థసారథి సీనియర్, జూనియర్ హాకీ క్రీడాకారులు ఉన్నారు.

సమ్మె శిబిరంలో మహాత్ముడికి నివాళి

కైలాస్‌నగర్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలనే డిమాండ్‌తో సమ్మె చేపట్టిన అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, ఎండీఎం కార్మికులు మహాత్మాగాంధీ జయంతి పురస్కరించుకుని సోమవారం వినూత్న నిరసన తెలిపారు. కలెక్టరేట్ ఎదుట గల వారి సమ్మె శిబిరంలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం గాంధీ చిత్రపటానికి తమ సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు.ఇందులో ఆయా సంఘాల నాయకులు, అంగన్‌వాడీలు, ఆశలు, ఎండీఎం కార్మికులు పాల్గొన్నారు.

చేపల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

ఉట్నూర్‌రూరల్: చేపల పెంపకంతో గిరిజనులు ఆర్థికాభివృద్ధి సాధించాలని పెసా కోఆర్డినేటర్ అర్క వసంత్‌రావు, మత్స్యశాఖ పరిశీలన అధికారి రాథోడ్ సురేశ్ అన్నారు. మండలంలోని నర్సాపూర్-బి గ్రామ పంచాయతీ పరిధిలోని పలు చెరువుల్లో గిరిజన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో చేప పిల్లలను సోమవారం వదిలారు. కార్యక్రమంలో నర్సాపూర్ సర్పంచ్-బి కళావతి, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

దళితబంధు లొల్లి





బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు



ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



ఎమ్మెల్సీ దండే విఠల్

- బోథ్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో మారుతున్న జాబితా
- ఆ ఎమ్మెల్యేలు ఇచ్చిన లిస్టులు లేనట్లే!
- 'బీఆర్‌ఎస్' టికెట్ నిరాకరణ తర్వాత పరిణామం
- ఈ రెండు చోట్ల ఎమ్మెల్సీ విఠల్‌కు 'సంక్షేమ' అమలు బాధ్యతలు

సాక్షి,ఆదిలాబాద్: రెండో విడత దళితబంధు లబ్ధిదారుల జాబితాకు త్వరలో ఆమోద ముద్రపడే అవకాశం ఉండగా, బోథ్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో గతంలో ఆయా ఎమ్మెల్యేలు ఇచ్చిన లిస్టులు పూర్తిగా మారిపోతాయనే ప్రచారం సాగుతోంది. ప్రధానంగా ఈ రెండు నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపూరావు, రేఖానాయక్‌తో పాటు ఆసిఫాబాద్‌లో ఆత్రం సక్కుకు వచ్చే ఎన్నికలకు సంబంధించి బీఆర్‌ఎస్ టికెట్ ఇవ్వని విషయం తెలిసిందే. అయితే బోథ్, ఖానాపూర్‌లో దళితబంధు పరంగా పెద్ద ఎత్తున ఆరోపణలు రావడంతో ఇక్కడ జాబితా మారిపోతుందని చెప్పుకుంటున్నారు. నెల క్రితం బీఆర్‌ఎస్ ఎన్నికల జాబితా విడుదలకు ముందే ఈ దళితబంధుకు సంబంధించి రెండో విడత లబ్ధిదారుల లిస్టులను ఆయా ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి పంపించారు. అయితే తాజా పరిణామాలు ఈ నియోజకవర్గాల్లో రాజకీయంగా ఉత్కంఠ కలిగిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..
దళితబంధు కింద జిల్లాలో మొదటి విడత 249 మంది లబ్ధిదారులకు ప్రయోజనం దక్కింది. ఈ పథకం కింద వివిధ సెక్టార్లలో లబ్ధిదారులకు ప్రభుత్వం యూనిట్లు అందిస్తుంది. తద్వారా వారి ఆర్థికాభివృద్ధికి చేయూతనిస్తుంది. దీంట్లో రూ.10 వేలు మినహా రూ.9 లక్షల 90 వేలు లబ్ధిదారుడికి అందజేస్తుంది. ఆ రూ.పది వేలు రక్షణ నిధి కింద ఉంటాయి. జిల్లాలోని ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలతో పాటు పాక్షికంగా వచ్చేటువంటి ఖానాపూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లోనూ కలిపి మొత్తంగా మొదటి విడతలో రూ.24.9 కోట్లు లబ్ధిదారులకు అందజేసింది. ఇక రెండో విడతకు సంబంధించి ప్రభుత్వం నియోజకవర్గానికి 1100 మందికి లబ్ధి చేకూర్చనున్నట్లు ఇది వరకే ప్రకటించింది. ఈ లెక్కన జిల్లాకు సుమారు 2800 మందికి రెండో విడతలో రూ.280 కోట్లు లబ్ధి చేకూర్చేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుంది.

ప్రక్రియ జరుగుతుందిలా..
రెండో విడత దళితబంధు పరంగా జిల్లాలో లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఈ ప్రక్రియ జరుగుతుంది. అయితే నియోజకవర్గాల వారీగా అప్పట్లో ఎమ్మెల్యేలు జాబితా పంపించారు. జిల్లాలో ఆదిలాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే జోగురామన్న ఎంపిక చేసిన వారికే లబ్ధి జరగనుండగా, బోథ్, ఖానాపూర్‌లో అప్పుడు ఇచ్చిన జాబితా మారిపోనుంది. ఇక ఆసిఫాబాద్‌లో లబ్ధిదారుల జాబితాపై పూర్తి స్పష్టత రాలేదు.

ఎమ్మెల్సీ విఠల్‌కు బాధ్యతలు

బోథ్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో ప్రభుత్వ పరంగా సంక్షేమ పథకాల అమలు బాధ్యతను ఎమ్మెల్సీ దండే విఠల్‌కు అప్పగించింది. తద్వారా ఈ రెండు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు రాథోడ్ బాపూరావు, రేఖానాయక్‌లకు ఇందులో ఎలాంటి బాధ్యత ఉండదు. అయితే ఇప్పుడు లిస్టు మారిపోతుందనే ప్రచారం రాజకీయంగా సంచలనం కలిగిస్తుంది. ఈ రెండు నియోజకవర్గాల్లో ఇది వరకు ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన జాబితా మారుతుండటం ప్రకంపనలు సృష్టిస్తోంది. ప్రధానంగా ఆయా నియోజకవర్గాల్లో దళితబంధు లబ్ధిదారులను డబ్బులు తీసుకుని ఎంపిక చేస్తున్నారని తన దృష్టికి వచ్చిందని స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ పేర్కొనడం గతంలో సంచలనం కలిగించింది. ఈ పరిణామమే ఆయా నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పుపరంగా నిర్ణయం తీసుకున్నారనే అభిప్రాయం కూడా వ్యక్తం అయింది.

ఇదిలా ఉంటే జిల్లాలో ఈ ప్రక్రియ అమలు కోసం ఆదిలాబాద్ నియోజకవర్గానికి జెడ్పీ డిప్యూటీ సీఈవో రాజేశ్వర్ రాథోడ్, బోథ్‌కు డీఆర్డీవో ఏపీడీ రవీందర్ రాథోడ్, ఆసిఫాబాద్‌కు జెడ్పీ సీఈవో గణపతి, ఖానాపూర్‌కు డీఆర్డీవో కిషన్ ప్రత్యేక అధికారులుగా ఇది వరకే నియమితులయ్యారు. ఎమ్మెల్యేలు సూచించిన లబ్ధిదారుల వివరాలకు సంబంధించి ప్రత్యేక అధికారుల ద్వారా జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఐకే రెడ్డి దగ్గరకు వెళ్తుంది. అక్కడ ఆమోదం తర్వాత తిరిగి ప్రత్యేక అధికారుల ద్వారా జిల్లా కలెక్టర్‌కు జాబితా చేరుతుంది. ఆ తర్వాత లబ్ధిదారులకు యూనిట్లు గ్రౌండింగ్ చేస్తారు. ఇప్పుడు బోథ్, ఖానాపూర్‌లలో ఎమ్మెల్యేల స్థానంలో ఎమ్మెల్సీ దండే విఠల్‌కు సంక్షేమ పథకాల అమలు బాధ్యతను అప్పగించారు. ఈ దళితబంధుతో పాటు గృహలక్ష్మి, బీసీ, మైనార్టీలకు రూ. లక్ష సాయం వంటి పథకాల అమలును కూడా ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్సీయే పర్యవేక్షించనున్నారు.

'బతుకమ్మ' కానుకలొచ్చాయ్



వివిధ డిజైన్లలో బతుకమ్మ చీరలు (ఫైల్)

- జిల్లాకు చేరిన చీరలు
- ఈ ఏడాది ముందుగానే పంపిణీ
- రేపటి నుంచి ప్రక్రియ షురూ

జిల్లాకు అవసరమైన చీరలు	2,63,247
ఇప్పటివరకు వచ్చినవి	1,96,000
ఇంకా రావాల్సినవి	67,247

కైలాస్‌నగర్: ఆడపడుచులకు కానుకగా రాష్ట్ర ప్రభుత్వం కొన్నేళ్లుగా అందజేస్తున్న బతుకమ్మ చీరలు జిల్లాకు చేరాయి. ఈ నెల 14 నుంచి పండుగ సంబరాలు షురూ కానున్నాయి. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది ముందుగానే వీటిని లబ్ధిదారులకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తీరొక్క రంగులు, డిజైన్లలో రూపొందించిన చీరలను ఇప్పటికే జిల్లాకు సరఫరా చేసింది. వీటిని ఆరు ప్రాంతాల్లోని మార్కెట్ కమిటీల గోడౌన్లలో భద్రపరిచారు. అక్కడి నుంచి ఆయా మండలాలకు సరఫరా చేయనున్నారు. అర్హులైన ప్రతీ మహిళకు చీర అందించేలా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ నెల 4నుంచి రేషన్ షాపుల ద్వారా వీటిని పంపిణీ చేయనున్నారు. ఇందులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మానిటరింగ్ టీమ్‌ను కూడా నియమించనున్నారు. ఆరు గజాల చీరతో పాటు వృద్ధ మహిళలకు తొమ్మిది గజాల (గోచి) చీరలను కూడా అందజేయనున్నారు.

ఆరు గోదాముల్లో భద్రం..
జిల్లాకు ఇప్పటి వరకు చేరిన చీరల్లో ఆరు మీటర్లవి 1,76,000 ఉండగా, 20వేల గోచి చీరలు (తొమ్మిది మీటర్లవి) ఉన్నాయి. ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డు గోదాంలో 67,550 చీరలు, జైనథ్ మార్కెట్ యార్డులో 19,700, బోథ్‌లో 24,200, ఇచ్చోడ మార్కెట్ యార్డులో 37,350, నార్నూర్‌లో 15,400, ఇంద్రవెల్లిలోని గోదాంలో 31,800 చీరల చొప్పున భద్రపర్చారు. వీటిని సమీప మండల కేంద్రాలకు తరలించి అక్కడి నుంచి గ్రామాల వారీగా సరఫరా చేయనున్నారు.

రేషన్‌షాపుల ద్వారా పంపిణీ
18 ఏళ్లు నిండి రేషన్‌కార్డులో పేరు ఉన్న మహిళలు, యువతులకు వీటిని అందజేయనున్నారు. ఎమ్మెల్యేల ద్వారా ఈ నెల 4వ తేదీన పంపిణీ ప్రక్రియను ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ప్రారంభించనున్నారు. అనంతరం మండలాలు, గ్రామాల్లోని చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేస్తారు. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో కొన్ని రంగుల చీరలు మాత్రమే ఉండగా ఈ ఏడాది 200కు పైగా వివిధ రకాల డిజైన్లతో కూడిన చీరలను ప్రభుత్వం తయారు చేయించింది.

పకడ్బందీ పర్యవేక్షణ
బతుకమ్మ చీరలను పకడ్బందీగా పంపిణీ చేయడంతో పాటు పర్యవేక్షించేందుకు వీలుగా గ్రామ, మండలస్థాయిలో అధికారులతో కూడిన ప్రత్యేక కమిటీలను గతంలో మాదిరిగా ఏర్పాటు చేయనున్నట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. మండలంలో ఏ జీపీకి ఎన్ని చీరలు వచ్చాయి, ఎంత మందికి పంపిణీ చేశారు.. తదితర విషయాలను జిల్లా అధికారులకు తెలియజేస్తారు. మండల స్థాయిలో ఎంపీడీవో, తహసీల్దార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఐకేపీ సీసీ, ఏపీఎం, ఎంపీడీవో పర్యవేక్షిస్తారు. గ్రామస్థాయిలో వీవోఏ, కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళ సమాఖ్య అధ్యక్షురాలు పర్యవేక్షించనున్నారు.

రేపటి నుంచి పంపిణీ..
ఆడపడుచులకు కానుకగా అందించే బతుకమ్మ చీరలు జిల్లాకు చేరాయి. వాటిని జిల్లాలోని ఆరు వ్యవసాయ మార్కెట్ కమిటీల గొడౌన్లలో భద్రపరిచాం. అక్కడి నుంచి గ్రామాల వారీగా సరఫరా చేస్తాం. ఈ నెల 4నుంచి పంపిణీ చేస్తాం. 18 ఏళ్లు నిండి రేషన్ కార్డులో పేరు కలిగిన మహిళలు, యువతులకు అందజేస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల కనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.
– కిషన్, డీఆర్డీవో

మహాత్ముడి ఆశయ సాధనకు పాటుపడాలి



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, డీఆర్వో

- కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మహాత్మాగాంధీ జయంతి పురస్కరించుకుని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులతో కలిసి మహాత్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ గాంధీజీ చూపిన మార్గంలో నడుస్తూ శాంతియుత సమాజ స్థాపనకు పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో రాథోడ్‌రమేశ్, డీఏవో వర్ణ, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు రాంరెడ్డి, నలందప్రియ, తహసీల్దార్ శ్రీనివాస్, డీపీఆర్వో విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛభారత్

ఆదిలాబాద్‌టౌన్: గాంధీ జయంతి పురస్కరించుకుని జిల్లా కోర్టు ప్రాంగణంలో సోమవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. జిల్లా మొదటి అదనపు జడ్జి డాక్టర్ శివరాంప్రసాద్, డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, న్యాయమూర్తి మంజుల సూర్యవార్, తులసీ దుర్గారాణి, కోర్టు సిబ్బందితో కలిసి కోర్టు ఆవరణలో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా జడ్జి శివరాంప్రసాద్ మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రతతో ఆహ్లాదకర వాతావరణం కనిపిస్తుందన్నారు. స్వచ్ఛత కార్యక్రమంలో మున్సిపల్ అధికారులను హాజరు కావాలని కోరినా వారు రాలేదన్నారు. విషయాన్ని జిల్లా ప్రధాన జడ్జి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇందులో కోర్టు ఉద్యోగులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



శ్రమదానం చేస్తున్న జడ్జీలు

టెట్‌తో సంబంధం లేకుండా పదోన్నతులు కల్పించాలి



మాట్లాడుతున్న సునీల్

ఆదిలాబాద్‌టౌన్: టెట్‌తో సంబంధం లేకుండా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని తపస్ జిల్లా అధ్యక్షుడు సునీల్ చవాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం ఓల్డ్ హౌసింగ్ బోర్డ్‌లోని మాధవ నిలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీనియర్ ఉపాధ్యాయులందరికీ స్కూల్ అసిస్టెంట్లుగా, భాషా పండితులందరికీ టెట్‌తో నిమిత్తం లేకుండా పదోన్నతులు కల్పించి న్యాయం చేయాలన్నారు. ఇతర శాఖల్లో పనిచేస్తున్న స్పౌజ్ ఉద్యోగులు గత 5,8 సంవత్సరాలుగా స్పౌజ్ వాడుకోలేదనే సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలన్నారు. వారి సర్వీస్ రిజిస్టర్స్‌ను వెరిఫై చేసి బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే ప్రభుత్వం తక్షణమే పీఆర్‌సీ కమిటీ నియమించి 25శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇందులో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వలభోజు గోపీకృష్ణ, ఆర్థిక కార్యదర్శి బచ్చువార్ నారాయణ, నాయకులు కుమ్ర యాదవ్‌రావ్, బత్తుల గంగాధర్, సురేష్ జోషి, బలిరాం తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటకలో అమలు చేస్తున్నాం..

- అన్నివర్గాల సంక్షేమమే 'ఆరు గ్యారంటీల' హామీ
- కాంగ్రెస్ మేనిఫెస్టో అమలు కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న శ్రీధర్‌బాబు

ఆదిలాబాద్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల హామీలను అమలు చేసి ప్రజలకు అండగా నిలుస్తోందని, రాబోయే రోజుల్లో తెలంగాణలోనూ అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేసి తీరుతుందని ఆ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో అమలు కమిటీ చైర్మన్ దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆదిలాబాద్ జిల్లా మావల మండల కేంద్రంలోని చిల్కూరి లక్ష్మీ గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన మేనిఫెస్టో కమిటీ జిల్లాస్థాయి విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై వివిధ వర్గాల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే రైతులకు ఏటా రూ.15వేలు, కూలీలకు రూ.12వేలు, పంటలకు బోనస్, రూ.2లక్షల వరకు రైతు రుణమాఫీ, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతినెల రూ. 2,500తో పాటు రూ.500లకు గ్యాస్ సిలిండర్, ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం , ఇళ్లు లేని వారికి రూ.5లక్షలతో ఇందిరమ్మ పథకం కింద ఇంటి నిర్మాణం, ప్రతీ కుటుంబానికి 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, ఉద్యమకారులకు 250 చదరపు గజాల ఇంటి స్థలంతో పాటు ఇంటిని నిర్మించి ఇస్తామన్నారు. యువ వికాసం కింద రూ.5లక్షలతో విద్యా భరోసా కార్డు, ప్రతీ మండల కేంద్రంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేసి కార్పొరేట్ స్థాయి విద్య అందించనున్నట్లు తెలిపారు. వృద్ధులకు నెలకు రూ.4వేల పింఛన్‌తో పాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10లక్షలతో ఉచిత వైద్య సేవలు అందిస్తామన్నారు. పేదల సంక్షేమం, అభివృద్ధికి పాటుపడే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత, ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సంజీవ్‌రెడ్డి, జెడ్పీటీసీలు గణేశ్‌రెడ్డి, నర్సయ్య, నాయకులు అశోక్, గజేందర్, వెడ్మ బొజ్జు, గణేశ్ రాథోడ్, రాజు, ప్రభాకర్, చంటి, రూపేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'లైంగికదాడుల అదుపులో ప్రభుత్వాలు విఫలం'



మాట్లాడుతున్న లక్ష్మి

ఎదులాపురం: మహిళలపై లైంగికదాడులు అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి కట్ల లక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలోని కుమురంభీమ్ భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలపై రోజురోజుకు హత్యలు, లైంగికదాడులు పెరిగిపోతున్నాయన్నారు. ఇటీవల ఉజ్జయినిలో బాలికపై జరిగిన లైంగిక దాడి ఘటనను ఖండించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పూజ, రంజనాబాయి, జ్యోతి, అనురాధ, రేణుక, సంధ్య, సువర్ణ, కవిత, జగన్‌సింగ్, వామన్, సురేశ్ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌తోనే 'గిరి' గ్రామాల అభివృద్ధి



కుమురంభీం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్లు రాథోడ్ జనార్దన్, కోవ లక్ష్మి

నార్నూర్: బీఆర్‌ఎస్‌తోనే ఆదివాసీ, గిరిజనులకు ప్రత్యేక గుర్తింపుతో పాటు గిరి గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, కుమురంభీం జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. సోమవారం ఇద్దరు కలిసి గాదిగూడ మండలంలో పర్యటించారు. ముందుగా లోకారి-కే గ్రామంలో భీం విగ్రహానికి నివాళులర్పించారు. కొత్తపల్లి (జీ) సర్పంచ్ బారిక్‌రావు సతీమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పలు గ్రామాల్లో పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కొట్లాడి తెచ్చుకున్న రాష్ట్రంలో సామాన్యుల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. గిరిజన సంక్షేమం, అభివృద్ధి కోసం పని చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లోనూ ఆదరించాలన్నారు. వారి వెంట కుమురంభీం జిల్లా గ్రంథాలయ చైర్మన్ కనక యాదవ్‌రావు, ఎంపీపీ ఆడ చంద్రకళరాజు, సర్పంచ్ మెస్రం జైవంతరావు, జంగుబాయి ఆలయ కమిటీ చైర్మన్ కొడప జాకు, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పూసం బాదిరావు, మెస్రం హన్మంతరావు, తదితరులున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి
ఏడు దశాబ్దాలుగా ఏజెన్సీ ప్రాంతంలో నివాసం ఉంటున్న గిరిజనేతరుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నాన్‌ట్రైబల్ సంఘం నాయకులు కోరారు. ఈమేరకు జెడ్పీ చైర్‌పర్సన్‌లకు వినతిపత్రం అందజేశారు. ఇందులో సంఘం నాయకులు పండరి, సిద్దార్థ్, రవీందర్, దిలీప్ తదితరులున్నారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



అనుముల శ్రీ వైభవి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్ కాలనీకి చెందిన అనుముల శ్రీవైభవి జాతీయస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భూమన్న, కిషన్ తెలిపారు. స్థానిక రవి హైస్కూల్‌లో ఆరోతరగతి చదువుతున్న విద్యార్థిని తండ్రి అనుముల అమర్ ప్రోత్సాహంతో సెప్టెంబర్ 29, 30, ఈ నెల 1న హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సింగిల్స్‌లో ద్వితీయస్థానంలో నిలిచి వెండి పతకం, డబుల్స్‌లో బంగారు పతకం సాధించింది. నవంబర్ 1 నుంచి చెన్నైలో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననుంది.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



పోటీలు ప్రారంభిస్తున్న జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్: క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల కళాశాలలో సోమవారం బీసీ గురుకులాల ఉమ్మడి జిల్లాస్థాయి అండర్ 14, 19 క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక, శారీరక ధృడత్వం పెరుగుతుందని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. విద్యార్థులకు ఆసక్తి కలిగిన క్రీడలలో తగిన ప్రోత్సాహం ఇస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గురుకులాల ఆర్సీవో గోపిచంద్, ప్రిన్సిపాల్ విద్య, కౌన్సిలర్ పవన్ నాయక్, రుక్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రెండోరోజు కొనసాగిన శిక్షణ



మాట్లాడుతున్న వేదపండితుడు

భైంసా(ముధోల్): బాసర ఆలయంలో ఉమ్మడి జిల్లా నూతన అర్చకులకు శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. ధూపదీప నైవేద్యం కింద ఉమ్మడి జిల్లాలో ఎంపికైన 650 మంది అర్చకులకు శిక్షణ ఇచ్చారు. సోమవారం సేవా ఆగమం, పంచరాత్ర ఆగమంలో శిక్షణ ఇచ్చారు. బాసర ఆలయంలోని డార్మెటరీ భవనంలో శిక్షణ కొనసాగుతోంది.

12 మందిపై కేసు

కుంటాల: కుంటాలలో ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణకు 12 మందిని బాధ్యులుగా గుర్తించినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సోయా రైతు చిత్తు

పీఏసీఎస్‌ను ముట్టడించిన రైతులు



బోథ్ మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో విక్రయించిన సోయా విత్తనాలు రైతులు చేన్లలో విత్తారు. ఈ విత్తనాలతోనే పంటలు కుళ్లిపోయాయని రైతులు ఇటీవల కార్యాలయాన్ని ముట్టడించారు. తమకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అధికారులు తమకు అవగాహన కల్పించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

- తెగుళ్లతో గింజ రాక కష్టం
- మందులు పిచికారీ చేసినా ఫలితం శూన్యం
- వాతావరణ మార్పులే కారణం
- ఆందోళనలో సోయా రైతులు

బోథ్: వాతావరణ మార్పుల కారణంగా జిల్లాలో సోయా పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. పూత దశలో పంటకు తెగుళ్లు సోకగా రైతులు సస్యరక్షణ చర్యలు, పిచికారి చేసినా ఫలితం లేకపోయింది. వేల ఎకరాల్లో సాగైన పంట తొలిసారి గింజ రాక పట్టిపోయింది. దీంతో బాధిత రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి నష్టపోయామని వాపోతున్నారు. కనీసం పంటల బీమా ఉన్నా తమకు పరిహారం వచ్చేదని పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

విత్తనాలపైనే అనుమానం

ప్రభుత్వం రైతులకు రాయితీపై అందించే సోయా విత్తనాలను నాలుగేళ్ల నుంచి సరఫరా నిలిపివేసింది. దీంతో రైతులు మార్కెట్‌లో విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది కేడీ726 అనే రకం విత్తనాలను సొసైటీల ద్వారా కొన్నారు. ప్రైవేటు మార్కెట్‌లో సోయా, తదితర విత్తన రకాలను కొనుగోలు చేశారు. సొసైటీ ద్వారా కొన్న విత్తనాలు



తెగుళ్లు సోకిన సోయా పంట

వేయగా పంట కుళ్లిపోయిందని రైతులు పేర్కొంటున్నారు. పురుగుల మందులు పిచికారీ చేయడంతో పెట్టుబడులు పెరిగాయని అంటున్నారు. ప్రైవేట్ దుకాణాల్లో కొన్న విత్తనాలు బాగానే ఉన్నాయని, సొసైటీలో కొన్న విత్తనాల్లో లోపం ఉందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సొసైటీ, ప్రైవేట్ మార్కెట్‌లో కొన్న విత్తనాలు వేసిన పంటల్లో తెగుళ్లు సోకిందని చెబుతున్నారు. తెగుళ్లను ముందు గమనించిన వారు పిచికారి చేయడంతో పంట బాగానే ఉందని, తెగుళ్లు గుర్తించడం ఆలస్యంతో కాయ దశలో పంట కుళ్లిపోయిందని అంటున్నారు.

తెగుళ్లు గుర్తించాకే పిచికారీ చేయాలి



వాతావరణ మార్పుల వల్ల సోయాకు పలు తెగుళ్లు సోకుతాయి. వాటిని గుర్తించాకే పురుగుల మందులు పిచికారి చేయాలి. ఇప్పటికే రైతులకు అవగాహన కల్పించాం. పంట తెగుళ్ల బారిన పడి పాడైన తర్వాత మందులను పిచికారి చేయడంతో లాభం ఉండదు. విత్తనాల లోపమని కొందరు అంటున్నారు. వాటిని కూడా పరిశీలిస్తాం.

– వెండి విశ్వామిత్ర, వ్యవసాయాధికారి, బోథ్

సస్యరక్షణ చర్యలు చేపట్టినా..ఫలితం శూన్యం



పంట రంగు మారినట్టు చూపిస్తున్న రైతు

జిల్లావ్యాప్తంగా వానాకాలంలో రైతులు పత్తి, తర్వాత సోయా పంటలు సాగు చేశారు. ఈ ఏడాది సోయా సాగు 1,08,522 ఎకరాలు సాగైంది. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి వస్తుందని ఆశతో పంట వేశారు. విత్తనాలు విత్తిన తర్వాత సీజన్ ఆశాజనకంగానే ఉంది. అయితే, వర్షాలు అధికంగా కురవడంతో పూతదశలో పంటకు తెగులు సోకింది. వాతావరణ మార్పులే దీనికి కారణమని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. కాయవచ్చే దశలో సోయా పంట రంగుమారింది. కాయదశలో తెగులు సోకి కుళ్లిపోయింది. సస్యరక్షణ చర్యలు చేపట్టినా, పురుగుల మందులు పిచికారి చేసినా ఫలితం లేకపోయిందని రైతులు పేర్కొంటున్నారు. జిల్లాలో బోథ్, నేరడిగొండ, ఇచ్చోడ, బజార్‌హత్నూర్‌తోపాటు పలు మండలాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది.

8 ఎకరాల్లో తెగుళ్లు సోకాయి



బోథ్‌లోని సొసైటీలో ఒక బ్యాగ్ రూ. 2250 చొప్పున 9 బ్యాగుల కేడీఎస్ 726 సోయా విత్తన రకాన్ని కొన్నా. 8 ఎకరాల్లో సోయా వేశాను. కాయ వచ్చే దశలో పంటకు తెగుళ్లు సోకడంతో రంగు మారింది. వ్యవసాయాధికారుల సలహాతో పిచికారీ చేసినా ఫలితం లేకపోయింది. పంట మొత్తం ఎండిపోయే పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం ఎకరాకు రూ. 20 వేల నష్ట పరిహారం అందించాలి.

– కుమ్మరి ప్రభాకర్, రైతు, కనుగట్టు, బోథ్ మండలం

సత్ప్రవర్తనతో మెలగాలి

- కలెక్టర్ రాహుల్ రాజ్



బహుమతులు అందజేస్తున్న కలెక్టర్, జడ్జి

ఆదిలాబాద్‌టౌన్: జైలుశిక్ష అనుభవిస్తున్న ఖైదీలు గతాన్ని మర్చిపోయి సత్ప్రవర్తనతో మెలగాలని, విడుదలైన అనంతరం కుటుంబానికి, సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక జిల్లా జైలులో నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గాంధీజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జిల్లా అదనపు సెషన్ జడ్జి శివరాం ప్రసాద్ మాట్లాడుతూ క్షణికావేశంలో నేరస్తులుగా మారడం జరిగిందని, జైలు జీవితం అనంతరం సమాజహితం కోసం మార్పు చెందాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చాటిన ఖైదీలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ అశోక్ కుమార్, జడ్జి దుర్గారాణి, డీఎస్పీ ఉమేందర్, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి క్షమాదేశ్‌పాండే, డీపీఆర్వో విష్ణువర్ధన్, న్యాయవాది గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి భవన్‌కు ఆదివాసీల పాదయాత్ర



పాదయాత్రగా వెళ్తున్న ఆదివాసీలు

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలం బట్టిసావర్‌గాం శివారు ప్రాంతంలోని సర్వే నంబర్ 72లో కొంతకాలంగా నివాసం ఉంటున్న ఆదివాసీలు ఇంటి స్థలాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) ఆధ్వర్యంలో ప్రగతి భవన్‌కు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆ సమితి జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్ మాట్లాడుతూ మావల మండలంలోని కుమురంభీం కాలనీలో నివాసం ఉంటున్న ఆదివాసీల ఇళ్లస్థలాలకు పట్టాలు ఇవ్వాలని, గృహలక్ష్మి పథకం మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన పాదయాత్ర ఈ నెల 9 వరకు కొనసాగుతుందన్నారు. సీఎం కేసీఆర్‌కు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. పాదయాత్రకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావ్, జిల్లా ఉపాధ్యక్షుడు కుమ్ర శ్యాంరావ్, ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక బాయి, ఉపాధ్యక్షులు ఉయిక ఇంద్రబాయి, ఉట్నూర్ డివిజన్ అధ్యక్షుడు కోట్నాక్ బారిక్‌రావ్, మహిళా సంఘం డివిజన్ అధ్యక్షురాలు శాంతాబాయి, తుడుందెబ్బ ఇంద్రవెల్లి మండల అధ్యక్షుడు జుగ్నాక్ భరత్, మావల మండల అధ్యక్షుడు ఆత్రం గణపతి, పట్టణ అధ్యక్షుడు కుడ్మెత ప్రకాష్ పాల్గొన్నారు.

ఆస్తి కోసం తమ్ముడి హత్య

- కుమారుడితో కలిసి ఘాతుకం
- నిందితుల అరెస్టు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ గంగారెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

లక్ష్మణచాంద(నిర్మల్): ఆస్తి కోసం తమ్ముడినే అన్న హత్య చేసిన ఘటన నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలో చోటు చేసుకుంది. గత నెల 29న నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని మల్లాపూర్‌లో జరిగిన హత్య వివరాలను డీఎస్పీ గంగారెడ్డి సోమవారం వెల్లడించారు. గ్రామానికి చెందిన అన్నదమ్ములు సిలారి పెద్ద మల్లయ్య, సిలారి చిన్న మల్లయ్య(45)కు కొంతకాలంగా భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. తరచూ పెద్ద మల్లయ్య తన తమ్ముడు చిన్న మల్లయ్యపై దాడి చేసేవాడు. దీంతో బాధితుడు అతని అన్న, కుమారుడు మహేష్‌లపై పోలీస్ స్టేషన్‌లో పలుమార్లు కేసు పెట్టాడు. తమ్ముడిపై కోపం పెంచుకున్న పెద్ద మల్లయ్య అతన్ని చంపితే ఇల్లు, భూమి తనకు చెందుతాయని భావించి కుమారుడు మహేష్‌తో కలిసి కుట్రపన్నాడు. గతనెల 29న ఇంటివద్ద జరిగిన గొడవను అదునుగా భావించిన తండ్రీకొడుకులు ఊరి చివరన మాటువేసి మాంసం కొట్టే కత్తి, ఇనుప రాడ్‌తో విచక్షణా రహితంగా దాడి చేశారు. తీవ్ర రక్తస్రావం కావడంతో చిన్నమల్లయ్య అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు క్షతగాత్రుడిని ముందుగా నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ గత నెల 30న మృతి చెందాడు. నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి మోటార్ సైకిల్, కర్ర కొడవలి, కత్తి, ఇనుప రాడ్ స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. హత్యకేసు ఛేదించిన సోన్ సీఐ నవీన్ కుమార్, ఎస్సైలు శ్రీకాంత్, రాజు, రవీందర్‌ను ఎస్పీ ప్రవీణ్ కుమార్, డీఎస్పీ గంగారెడ్డి అభినందించారు.

బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎంలు ఒక్కటే

- అవినీతి పాలనలో కేసీఆర్‌ను మించిన వారు లేరు
- మోదీ ప్రభుత్వ సంస్థలను బఠానీల్లా అమ్మేస్తున్నారు
- రిటైర్డు ఐఏఎస్ ఆకునూరి మురళి



సదస్సులో ప్రసంగిస్తున్న ఆకునూరి మురళి

కైలాస్‌నగర్: జైభారత్ అంటూ ప్రధాని నరేంద్ర మోదీ, జై తెలంగాణ పేరిట సీఎం కేసీఆర్ ప్రజలను భావోద్వేగాలకు గురి చేసి ఓట్ల రాజకీయానికి పాల్పడుతున్నారని రిటైర్డు ఐఏఎస్ ఆకునూరి మురళి ఆరోపించారు. తెలంగాణలో అవినీతి, ఆర్థిక దోపిడీ, దేశంలో విద్వేష, విభజన, పేదల వ్యతిరేక రాజకీయాలను ఓడించాలంటూ జాగో తెలంగాణ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పీఆర్‌టీయూ భవన్‌లో సోమవారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య వక్తగా హాజరయ్యారు. మోదీ, కేసీఆర్ పాలనలో దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి, ప్రభుత్వ సంస్థల నిర్వీర్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్‌ఎస్, బీజేపీలు బయటకు శత్రువుల్లా వ్యవహరిస్తూ లోపాయికారీగా స్నేహితుల్లా వ్యవహరిస్తున్నాయన్నారు. ఆ రెండు పార్టీలకు ఎంఐఎం సహకరిస్తుందన్నారు. ఈ మూడు పార్టీలు ఒక్కటేనని రానున్న ఎన్నికల్లో వీటిని ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అవినీతి పాలనలో కేసీఆర్ దేశంలోనే నంబర్ వన్ అని ఆయన్ను మించిన అవినీతిపరుడు మరేవరు లేరని ఆరోపించారు. కాళేశ్వరం, మిషన్ భగీరథ వంటి పథకాల్లో వేల కోట్లను దోచుకున్న కేసీఆర్ రాష్ట్రంలో దోచుకొండి, దాచుకొండి అనేలా తన ఎంపీ, ఎమ్మెల్యేలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. పేదలకు అవసరమైన విద్య, వైద్య రంగాలపై తొమ్మిదేళ్ల పాలనలో ఏ ఒక్కరోజు సమీక్షించని సీఎం కేసీఆర్ ఎన్నికలు వచ్చిందంటే కొత్త స్కీంలు ప్రవేశపెట్టి రాజకీయ లబ్ధికి పాల్పడుతున్నారన్నారు. రూ.28వేల కోట్లను రైతుబంధు పేరిట ఎన్‌ఆర్‌ఐలు, సినీనటులు, మంత్రులకు దోచిపెట్టారని మండిపడ్డారు. ఎంఐఎం అధినేత అసుద్దీన్ ఓవైసీ తన కుటుంబ ప్రయోజనాల కోసం యావత్ దేశంలోని ముస్లింలను బీజేపీకి తాకట్టు పెడుతున్నారన్నారు. తనకు అధికారమిస్తే రూ.15లక్షలను ప్రతీ పేదవాడి ఖాతాలో జమచేస్తానన్న మోదీ దాన్ని అమలు చేయకపోగా బడాబాబులకు సంబంధించి రూ.16లక్షల కోట్ల బ్యాంకు రుణాలను మాఫీ చేశారన్నారు. ప్రభుత్వ సంస్థలను బఠానీల్లా తన స్నేహితులైన అంబాని, అదానీలకు కట్టబెడుతున్నారన్నారు. ఈ మూడు పార్టీలను ఓడించకుంటే పేదల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారనుందన్నారు. సదస్సులో రిటైర్డు హైకోర్టు జడ్జి జస్టిస్ చంద్రకుమార్, సైకిలాబ్, డాక్టర్ పృథ్విరాజ్, డా.వినాయక్‌రెడ్డి, సాయిరి శశికాంత్, నైనాల గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ దేశభక్తిని పెంపొందిస్తుంది


- లెఫ్టినెంట్ కల్నల్ వికాస్
- ఉమ్మడి జిల్లా వార్షిక శిక్షణ శిబిరం ప్రారంభం



మాట్లాడుతున్న లెఫ్టినెంట్ కల్నల్ వికాస్

ఆదిలాబాద్: ఎన్‌సీసీ శిక్షణ దేశభక్తిని పెంపొందిస్తుందని ఉమ్మడి జిల్లా ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ వికాస్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం 32–టీ బెటాలియన్ ఎన్‌సీసీ జాయింట్ ఆన్యువల్ ట్రైనింగ్ క్యాంపును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణ ఎంతో క్రమశిక్షణ నేర్చుకునేలా చేస్తుందన్నారు. ఈ శిక్షణ శిబిరంలో మ్యాప్ రీడింగ్, వెపన్ ట్రైనింగ్, ఫైరింగ్, సాంస్కృతిక అంశాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అంతకుముందు ఎన్‌సీసీ కేడేట్లు గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమాండర్ కెప్టెన్ జగ్ రామ్, ఎన్‌సీసీ అధికారులు ఆనంద్‌రావు, శ్రీనివాసరావు, రాజానందం, నరేందర్, వందన, స్వరాజ్ సింగ్, రవీందర్, సుబేదార్ మేజర్ ఆనంద్ కుమార్, ట్రైనింగ్ ఆఫీసర్ తేజ్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

కలకలం రేపిన గుర్తు తెలియని మృతదేహం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

జైనథ్: మండలంలోని భోరజ్ ఎక్స్‌రోడ్ సమీపంలోని ఓ దాబా వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం దాబావద్ద సోమవారం మధ్యాహ్నం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు నీలం రంగు టీషర్ట్, నలుపురంగు ప్యాంట్ ధరించాడు. ముక్కు, నుదురు, ఎడమకన్ను, ఎడమ చేతిపై గాయాలున్నాయి. పంచాయతీ కార్యదర్శి సతీష్ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు కేసు నమోదు చేసి లుక్‌ఔట్ నోటీలు జారీ చేసారు. మృతునికి 40 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతుని ఒంటిపై గాయాలు కనిపించడంతో ఎవరో హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు.

వినాయక మండపం తొలగిస్తూ యువకుడు మృతి

సోన్: వినాయక మండపం తొలగించే క్రమంలో అదుపుతప్పి కిందపడడంతో యువకుడు మృతి చెందిన సంఘటన న్యూవెల్మల్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఓజా రాకేష్ (29) సోమవారం వినాయక మండపం తొలగించే క్రమంలో పైన ఉన్న సీలింగ్ రాడ్‌పై నుంచి అదుపు తప్పి సీసీరోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తల్లి నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

కుంటాల(ముధోల్): కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై హన్మాండ్లు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అంబుగామ గ్రామానికి చెందిన బాసర శంకర్ (62) తన అత్తగారి గ్రామమైన గుండాయిపేటకు వెళ్లి తిరిగి వస్తుండగా మార్గమధ్యలో కడుపులో నొప్పి వస్తోందని, పురుగుల మందు తాగి చనిపోతానని, అమ్మను, అన్నయ్యను బాగా చూసుకోవాలని చిన్న కుమారుడు అవినాష్‌కు ఫోన్‌చేసి తెలిపాడు. దీంతో కుటుంబ సభ్యులు గాలించగా.. మెదన్ పూర్ అటవీ ప్రాంతంలో మృతదేహం గుర్తించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రముఖ న్యాయవాది హఠాన్మరణం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది బెజ్జంకి హన్మంతరావ్ హఠాన్మరణం చెందారు. ఓల్డ్ హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన ఆయన 45 ఏళ్ల పాటు న్యాయవాద వృత్తిలో కొనసాగారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ న్యాయవాదిగా, మున్సిపల్, కుల సంఘానికి న్యాయ సలహాదారులుగా పనిచేశారు. ఐదు రోజుల క్రితం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతదేహానికి ఎమ్మెల్యే జోగు రామన్న, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, డీసీసీబీ డైరెక్టర్ బాలురి గోవర్ధన్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్రాల నగేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ దిగంబర్‌రావు పాటిల్, మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవ్‌రెడ్డి, సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

జనరల్ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స



పేషెంట్‌తో ఆస్పత్రి వైద్యసిబ్బంది

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వైద్యులు అరుదైన శస్త్రచికిత్స నిర్వహించినట్లు సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ తెలిపారు. మహారాష్ట్రలోని హిమాయత్‌నగర్‌కు చెందిన సాయినాథ్ (45)కు మలవిసర్జన ద్వారం నుంచి పెద్దపేగు బయటకు వచ్చింది. పరీక్షించిన రిమ్స్ ఆస్పత్రి వైద్యులు హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. ఆర్థిక పరిస్థితి బాగాలేకపోవడంతో బంధువుల సలహా మేరకు గత నెల 25న నిర్మల్‌లోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చేరాడు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు సిగ్మాయిడ్ మ్యుకోకుటోనియస్‌గా గుర్తించారు. 26న వైద్యులు సర్జన్ గణేశ్, మత్తు వైద్య నిపుణురాలు డాక్టర్ నళిని శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేయగా సోమవారం డిశ్చార్జి చేశారు. ఆపరేషన్‌కు ప్రైవేటులో అయితే దాదాపు రూ.3 లక్షల వరకు ఖర్చు అయ్యేదని, ఇక్కడ ఉచితంగా నిర్వహించామన్నారు. మెడికల్ కళాశాల అనుబంధ బోధన ఆస్పత్రిగా ఏర్పడిన తర్వాత జనరల్ ఆస్పత్రిలో మెరుగైన సేవలు అందుబాటులోకి వచ్చాయని, జిల్లా ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

'బీసీలకు 60 సీట్లు కేటాయించాలి'



మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్

ఆదిలాబాద్‌రూరల్: ఐదుశాతం ఉన్న రెడ్లకు 40, అరశాతం ఉన్న వెల్మలకు 12 సీట్లు కేటాయించి 60 శాతం ఉన్న బీసీలకు 23 ఎమ్మెల్యే సీట్లు కేటాయించిన బీఆర్‌ఎస్ పార్టీ బీసీల ద్రోహుల పార్టీనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలలో 136 కులాలు ఉంటే కేవలం ఆరు కులాలకు మాత్రమే సీఎం కేసీఆర్ 23 ఎమ్మెల్యే టికెట్లు కేటాయించి బీసీ వ్యతిరేక విధానాన్ని అవలంభించారని మండిపడ్డారు. కేటాయించిన సీట్లలో సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంకా ఎమ్మెల్యే అభ్యర్థుల టిక్కెట్లు ఖరారు చేయాని కాంగ్రెస్, బీజేపీలు సైతం బీసీలకు 60 సీట్లు కేటాయించాలన్నారు. తమకు కావాల్సింది సబ్సిడీ గొర్రెలు, గేదెలు, మేకలు కాదని, రాజ్యాధికారం కావాలన్నారు. ఓబీసీనని చెప్పుకుంటున్న ప్రధాని నరేంద్ర మోదీ బీసీలకు చేసిందేమీ లేదన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దత్తు, శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు శ్యాం, విక్రం, నగేష్, సత్యనారాయణ, రవీందర్, ప్రశాంత్ పాల్గొన్నారు.